



RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :301 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad





## 'సర్' నోటీసులపై ఈసీ కీలక ప్రకటన..

### వ్యక్తిగత హాజరు అవసరం లేదు!

సర్ నోటీసులపై ఈసీ కీలక ప్రకటన

అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత హాజరు అవసరం లేదు

కొత్త ఓటర్లు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

20 రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటరు జాబితా సవరణ పూర్తి

ఫారం-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి

**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ఊరటనిచ్చింది. ఓటర్లు వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. బీఎల్వోలే ఓటర్ల ఇంటికి వచ్చి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుంటారని వివరించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ మిగతా 2లో...

# 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'..

ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు

విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి

పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ

వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు

పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ:** అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం మిగతా 2లో...





# విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'..

ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు - ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ

24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు - రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం

దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం - 8 నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు ప్రయోజనం

**విజయవాడ సింధూరదర్శిని:**

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు.

విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్దిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ.45లక్షల వరకు లబ్ది చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్దిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నాయి.

నియోజకవర్గాల వారీగా లబ్దిదారుల సంఖ్య:
విజయవాడ (తూర్పు) – 7,990
విజయవాడ (పశ్చిమం) – 7,465
విజయవాడ (సెంట్రల్) – 5,815
గన్నవరం – 602, జగ్గయ్యపేట – 1,135
మైలవరం – 981, నందిగామ – 54
తిరువూరు – 15

# కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం: బీసీ జనార్దన్ రెడ్డి

ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ

పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి

ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన

**కర్నూలు, సింధూరదర్శిని:**
రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా శనివారం 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ



చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ మిగతా 2లో...

# పోలీస్ అంటే భయం కాదు.. ప్రజలకు కొండంత భరోసా!

ఘనంగా 521 మంది కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ క్రమశిక్షణ

మానవత్వంతో విధుల్లో రాణించాలి: మంత్రి ఎస్. సవిత

పోలీస్ యూనిఫాం అధికారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత: కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

బాధితుల పక్షాన నిలిచి నమ్మకాన్ని నిలబెట్టాలి: ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

**కడప సింధూరదర్శిని:** పోలీస్ అంటే ప్రజల్లో భయం కాదని, కష్టాల్లో ఉన్నవారికి కొండంత అండగా నిలుస్తారనే భరోసా కలగాలి" అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పరేడ్ మైదానంలో తొమ్మిది నెలల పాటు సాగిన కఠిన శిక్షణను పూర్తి చేసుకున్న 521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ శనివారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత నవ రక్షకుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారిలో కడప డీటీసీకి చెందిన 194 మంది సివిల్, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు. మిగతా 2లో...



## 'సర్' నోటీసులపై ఈసీ కీలక ప్రకటన

**(మొదటిపేజీ తరువాయి)**

జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి సమావేశమై పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6కు జతపరిచే డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని ఈ సందర్భంగా ఈసీ గుర్తుచేసింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌తో సహా ఇప్పటికే 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. జాబితాలో పేర్లు లేని వారు, యువత, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించింది. ఇందుకోసం సంబంధిత నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని సంప్రదించాలని, త్వరలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని పేర్కొంది. ఇటీవల గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో గల్లంతైన ఉదంతంపై ఈసీ స్పందిస్తూ, బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే చేయిస్తున్నామని తెలిపింది. గల్లంతైన వారిలో ఇప్పటికే 81 మంది ఫారం-6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకున్నారని గోవా సీఈవో వివరించారు. ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ సెక్రటరీకి రాసిన లేఖపై తలెత్తిన ఊహాగానాలపై కూడా ఈసీ స్పష్టత ఇచ్చింది. సదరు లేఖ ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక అధికారి పనితీరుకు సంబంధించినదని, అంతే తప్ప ఈసీ లేదా ఐటీ శాఖల విధానపరమైన అంశాలకు దానికి ఎలాంటి సంబంధం లేదని వివరించింది.

## 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'

**(మొదటిపేజీ తరువాయి)**

పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం: బీసీ జనార్దన్ రెడ్డి

**(మొదటిపేజీ తరువాయి)**

విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అత్తిరాలలో భక్తిపారవశ్యం

### కనులపండువగా గిరి ప్రదక్షిణ, గంగా హారతి

### శివనామస్మరణతో మార్మోగిన పుణ్యక్షేత్రం

### భారీగా తరలివచ్చిన భక్తజనం



రాజంపేట సింధూరదర్శిని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అత్తిరాల శనివారం సాయంత్రం భక్తిసాగరమైంది. శ్రీ త్రేతేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల జయజయధ్వానాల నడుమ గిరి ప్రదక్షిణ, గంగా హారతి కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' నినాదాలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు సారథ్యంలో ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంధ్యావేళలో నదీతీరంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సమర్పించిన గంగా హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులు అత్యంత శ్రద్ధాభక్తులతో గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ, ఎంతో పవిత్ర చరిత్ర, మహిమ కలిగిన అత్తిరాల త్రేతేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గంగా హారతి, గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో ఈ దివ్య క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రముఖ పుణ్యక్షేత్రాలకు దీటుగా అత్తిరాలలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ మహోత్సవంలో నాయకులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పోలీస్ అంటే భయం కాదు.. ప్రజలకు కొండంత భరోసా!







**(మొదటిపేజీ తరువాయి)**

### పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక : మంత్రి సవిత

శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే కానిస్టేబుళ్లే పోలీస్ వ్యవస్థకు అసలైన వెన్నెముక అని మంత్రి సవిత కొనియాడారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి సుమారు 6 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్ల సంక్షేమాన్ని గుర్తించి, వారికి ఇచ్చే నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని గుర్తుచేశారు.

?ప్రస్తుత బడ్జెట్‌లో పోలీస్ రక్షణ రంగానికి రూ.9,165 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం 'శక్తి' యాప్, నేరాల నియంత్రణ కోసం 'ఈగల్ వింగ్' నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. శాఖను మరింత పటిష్టం చేస్తూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇప్పటికే 6,050 పోస్టులను విడుదల చేశామని, త్వరలోనే మరో 2,000 అదనపు ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల సమస్యలపై మానవీయ కోణంలో స్పందించాలని సూచించారు. సమాజంలో గురుతర బాధ్యత నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగిస్తూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసేవారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

### పోలీస్ యూనిఫాం సేవకే అంకితం : కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

"పోలీస్ యూనిఫాం గౌరవంతో పాటు సమాజం పట్ల అత్యున్నత బాధ్యతను తెచ్చిపెడుతుంది" అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. న్యాయం, సహాయం కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ఆర్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రోజుల్లో అమాయక ప్రజలను ముంచేస్తున్న సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే బాధ్యతను యువ పోలీస్ సిబ్బంది భుజానకెత్తుకోవాలని సూచించారు.

### బాధితులకు భరోసా ఇవ్వాలి : ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

శిక్షణలో అలవర్చుకున్న కఠిన క్రమశిక్షణ, సమయ పాలన, నిబద్ధతను నిత్య విధుల్లో కొనసాగించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దిశానిర్దేశం చేశారు. చట్టం ముందు అందరూ సమానులేనన్న భావనతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజలతో మర్యాదగా ఉంటూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు.

మారుతున్న నేరాల శైలికి అనుగుణంగా సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి అంశాలపై నిరంతరం సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు.

### ప్రతిభావంతులకు పురస్కారాల ప్రదానం

శిక్షణ కాలంలో అసాధారణ ప్రతిభ, శారీరక దారుఢ్యాన్ని కనబర్చిన ఉత్తమ కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, వివిధ స్థాయిల పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ పీఆర్వో వెంకట్ యాదవ్ విశిష్ట వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# రాయలసీమకు ఉద్యాన సిరులు.. రైతన్నకు ఆదాయ భరోసా

- రూ.లక్ష కోట్ల సమగ్ర పెట్టుబడుల ప్రణాళికతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'
- 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు.. 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం లక్ష్యం
- అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా ఐహెచ్‌డీపీ ప్రారంభం
- సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి ప్రజలను భాగస్వాములను చేయాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి సింధూరదర్శిని: రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్ది, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రైజింగ్ రాయలసీమ' కార్యక్రమాన్ని ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడారు. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించే ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాలను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులకు ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు (ఐహెచ్‌డీపీ) ప్రారంభం కానుందని మంత్రి తెలిపారు. ప్రధాన కార్యక్రమంతో పాటు 201 క్లస్టర్లలో ఏకకాలంలో మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో ప్రత్యక్ష ప్రసారం, జిల్లా కేంద్రాల్లో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఒక మహిళా రైతు తన జిల్లా ఉద్యాన పంటలతో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పండ్ల బుట్టను ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రికి సమర్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఉద్యాన రంగాన్ని కీలకంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు ఐహెచ్‌డీపీ కార్యరూపమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు ప్రకాశం, మార్కాపురం కలిపి మొత్తం 10 జిల్లాల్లో 201 ఉద్యాన క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. తక్కువ నీటితో అధిక విలువ కలిగిన పంటల సాగు, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యం, సూక్ష్మ సేద్యం విస్తరణ, రైతులకు మెరుగైన ధరలు కల్పించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని చెప్పారు. నీటి వనరుల నుంచి ఎగుమతుల వరకు అన్ని వ్యవస్థలను ఒకే సమగ్ర ప్రణాళికలో అనుసంధానం చేస్తూ సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను సమీకరించేలా ప్రాజెక్టును రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో ప్రభుత్వ పెట్టుబడి సుమారు రూ.40,352 కోట్లు కాగా, సాగునీటి రంగానికి రూ.20,884 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ రహదారులకు రూ.4,562 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాసెసింగ్, శీతల గొలుసు వ్యవస్థలు, ప్యాకేజింగ్, రవాణా, సరకు నిర్వహణ రంగాల్లో మరో రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తోటలను మార్కెట్లతో అనుసంధానం చేసి, పంటలకు విలువ జోడించడం ద్వారా రైతులకు మరింత ఆదాయం సమకూర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆగస్టు 2026 నుంచి జూలై 2029 వరకు మూడు దశల్లో ప్రాజెక్టును అమలు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. 2026--27లో త్వరితగతిన పూర్తయ్యే పనులు, వెలిగొండ మొదటి దశ, నల్లమలసాగర్‌లో నీటి నిల్వతో 72 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2027-28లో ఎత్తిపోతల పథకాలు, కాలువలు, జలాశయాల అనుసంధానం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుతో మొదటి దశ సహా మొత్తం 139 క్లస్టర్లకు అభివృద్ధిని విస్తరించనున్నట్లు తెలిపారు. 2028--29లో మిగిలిన పనులను పూర్తి చేసి, ఎగుమతులకు ప్రాధాన్యమిస్తూ మొత్తం 201 క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై 2029 నాటికి సుమారు 9లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కల్పించడం, 4.3లక్షల ఎకరాల ఆయ కట్టును స్థిరీకరించడం, 540కి పైగా చిన్న నీటిచెరువులను పునరుద్ధరించడం లక్ష్యాలుగా నిర్దేశించుకు న్నట్లు మంత్రి తెలిపారు. అలాగే 6.5 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం, 5,721 కిలోమీటర్ల పక్కా గ్రామీణ రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 2030 నాటికి 14.41 లక్షల హెక్టార్లకు, ఉత్పత్తిని 222 లక్షల టన్నుల నుంచి సుమారు 435 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా చిన్న రైతులను సైతం పెద్ద మార్కెట్లతో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 9.6లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలగడంతోపాటు 19.7లక్షల ప్రత్యక్ష, 29.6లక్షల పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్పాదకతను 15-20 శాతం పెంచడం, నాణ్యత మెరుగుదల ద్వారా రైతులకు 20-25 శాతం అదనపు ధర లభించేలా చేయడం, ఏటా 40-45 లక్షల టన్నుల కోత అనంతర నష్టాలను తగ్గించడం ప్రాజెక్టు లక్ష్యాలని వివరించారు. మూడో సంవత్సరం నుంచి ఏటా సుమారు రూ.81 వేల కోట్ల అదనపు ఆర్థిక విలువ సృష్టించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రయోజనాలు ప్రతి రైతుకు తెలిసేలా ప్రజా అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని కలెక్టర్లకు మంత్రి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 26న జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే ముందస్తు మీడియా సమావేశాల్లో ఆయా జిల్లాల్లోని క్లస్టర్లు, విస్తీర్ణం, ప్రయోజనం పొందే రైతుల వివరాలను వెల్లడించాలని సూచించారు. సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు వ్యవసాయ, ఉద్యానవన, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు 'హార్ట్-టెక్ ఛాలెంజ్ అండ్ క్విజ్' నిర్వహించి, కోత అనంతర నిర్వహణ, శీతల గొలుసు వ్యవస్థలు, ఉత్పత్తి మూలాలను గుర్తించే సాంకేతికత, ఎగుమతులపై వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలన్నారు.

సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 వరకు మొత్తం 201 క్లస్టర్లలో ప్రచార రథాలు, కళాజాతాలు, బుర్రకథల ద్వారా ప్రాజెక్టు లక్ష్యాలను ప్రజలకు వివరించాలని మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1 వరకు పాఠశాలల్లో 'నా జిల్లా--నా పంట', 'పంటను గుర్తించండి', 'ఒక మొక్క భవిష్యత్తు కోసం' కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆయా జిల్లాలకు సంబంధించిన పంట మొక్కలను అందించి నాటించాలన్నారు. సెప్టెంబర్ 29న అన్ని క్లస్టర్లలో 'తోట పాఠశాల' నిర్వహించి సూక్ష్మ సేద్యం, వ్యవసాయ కుంటలు, కలుపును నియంత్రించే వీడ్ మ్యాట్స్ వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సెప్టెంబర్ 30న పది జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, అక్టోబర్ 1న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో పూలు, పండ్లు, కూరగాయలు, విత్తనాల ఇతివృత్తాలతో ముగ్గుల పోటీలు నిర్వహించాలని మంత్రి సూచించారు. అక్టోబర్ 2 ప్రధాన కార్యక్రమంలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేలా సమన్వయం చేయాలన్నారు. అక్టోబర్ 3 నుంచి 5వరకు ప్రారంభోత్సవ విశేషాలు, రైతుల భాగస్వామ్యం, విజయగాథలను డిజిటల్ మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ప్రధాన సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ ఉద్యానవన, వ్యవసాయ, పాఠశాల, కళాశాల విద్యా శాఖలు, డీఆర్‌డీఏ, మెప్మా, సమాచార పౌరసంబంధాల శాఖ, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌ను సమన్వయం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణయించిన తేదీల్లో కార్యక్రమాలు పూర్తి చేయడంతోపాటు రైతులకు ప్రాజెక్టుపై స్పష్టమైన అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో నీరు, ఉద్యాన పంటలు, రహదారులు, మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతులను సమగ్రంగా అనుసంధానం చేస్తున్నాం. ప్రభుత్వం వెచ్చించే ప్రతి రూపాయి ఫలితం రైతు ఆదాయంలో కనిపించాలి. ప్రతి పథకం ప్రయోజనం చివరి రైతు వరకు చేరాలి. రాయలసీమను ఉద్యాన సిరులతో అభివృద్ధి చేసి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



## పనుల్లో నాణ్యతే ధ్యేయంగా పని చేయాలి

### పి.ఆర్. క్వాలిటీ కంట్రోల్ ఇ. ఇ. రాజశేఖర్

గూడూరు( సింధూరదర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీరాజ్ శాఖ పనులలో నాణ్యతకి ప్రాముఖ్యత ఇస్తూ ప్రతి ఒక్కరు పని చేయాలని పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ ఒ అస్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ కోరారు. నెల్లూరు జిల్లా ఇఇగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి గూడూరు కు వచ్చిన సందర్భంలో ఆయన మాట్లాడడం జరిగినది. తదుపరి పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇ బాబురావు ఆధ్వర్యంలో వివిధ రకములైన చెట్లను నాటి, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని చెట్లను విరివిగా పెంచి కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. కార్యాలయంలో పచ్చని చెట్లు ఉండడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీని వాసరావు, క్వాలిటీ కంట్రోల్ డి ఈ ఈ బాబురావు, పి. ఆర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్. రియాజ్ అహ్మద్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కుమార్తె జన్మదిన సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు



గూడూరు( సింధూరదర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో శనివారం లైన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపి, టౌన్ మరియు వెస్ట్ క్లబ్బుల సేవా కార్యక్రమాల్లో భాగంగా లయన్ పల్లమాల ప్రభాకర్, శ్రీమతి రమాదేవీల కుమార్తె హేమన్య జన్మదినం సందర్భంగా బాలింతలకు పౌష్టికాహారం, పురిటి పిల్లలకు దుస్తులు, ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత పల్లమాల ప్రభాకర్ మాట్లాడుతూ తమ కుమార్తె జన్మదినం సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ యం.జె.యఫ్ ఆర్.వి రావు, యూత్ క్యాంపెయిన్ అండ్ ఎక్స్చేంజ్ యం.శ్రీనివాస్ యాదవ్, క్లబ్ ప్రెసిడెంట్ లు గోపీనాథ్ రెడ్డి, ప్రసాద్, ఇంతియాజ్, కార్యదర్శులు కావేరి, శివ, మురళి నాయుడు, ఎస్.ఎల్.ఎన్ స్వామి, సుధాకర్, నరేంద్ర రెడ్డి, షఫీ,హరి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు

### అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్



గూడూరు (సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ;

గూడూరు పట్టణ పరిధిలోని గాంధీనగర్ టిడ్కో గృహాల సమీపంలో ఉన్న శ్రీ పోలేరమ్మ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు పొంకం నాగేశ్వరరావు (తిరుపాలయ్య), శేషమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు పొంకం హనుమంతరావు, అనిల్ కుమార్ ల సంపూర్ణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ... తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేయడం పుణ్యకార్యమని, ఆలయానికి వచ్చే వయోవృద్ధులకు ఈ బెంచీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక ప్రదేశాలలో సౌకర్యాలు కల్పిస్తున్న ప్రగతి సేవా సంస్థకు,దాతలకు స్థానికులు , భక్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు, విఎంసి మెంబర్ వెంకటేశ్వరరావు కుమార్ నాయుడు రాజశేఖర్ రెడ్డి ఎక్సైజ్ డిపార్ట్మెంట్ దయాకర్ సతీష్ మాముడూరు వెంకట్రావు స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం మరో అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాలకు శ్రీకారం

**రూ.39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో వెంకటేశ్వరపురం టిడ్కో ప్రాంగణంలో నిర్మాణం**

**2 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్య**

**పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**



నెల్లూరు(సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; నెల్లూరు సిటీ నియోజకవర్గంలో విద్యా విప్లవానికి మరోఅడుగు పడింది. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో మరో అధునాతన పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారంచుట్టారు. రూ.39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాల భవనానికి పండుగ వాతావరణంలో మంత్రి శంకుస్థాపన చేశారు. పాఠశాల కోసం అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ౦1 భవనం, 43 తరగతి గదులు ఏర్పాటు కానున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు స్విమ్మింగ్ పూల్, వివిధ క్రీడలకు అవసరమైన వసతులతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. మంత్రి నారాయణపై విద్యార్థులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారాలోకేష్ ఆలోచనలకు,సీఎం చంద్రబాబు నాయుడి విజన్ కు అనుగుణంగా వీఆర్ హైస్కూల్ తరహాలో నెల్లూరు నగరంలో మరో 17 ప్రభుత్వ పాఠశాలలను సుమారు రూ.300 కోట్లతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాను వీఆర్ హైస్కూల్లో చదివి, అదే కాలేజ్లో నెలకు రూ.120 జీతానికి పనిచేశానని గుర్తుచేశారు. గత ప్రభుత్వం వీఆర్ హైస్కూల్ను మూసివేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో పాఠశాలను అభివృద్ధి చేశామని చెప్పారు. తాను కూడా ఒకప్పుడు పేదరికాన్ని అనుభవించానని,తాటాకు గుడిసెలో పుట్టి పెరిగానన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుకుని అంచెలంచెలుగా ఎదిగానని తెలిపారు. తన లాంటి ఇబ్బందులు పేద పిల్లలకు రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నానన్నారు. వీఆర్ హైస్కూల్ లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను తన పిల్లలు కల్పిస్తున్నారని, బస్సుల నిర్వహణ, స్నాక్స్ను నారాయణ విద్యాసంస్థల నుంచే అందిస్తున్నామని తెలిపారు. ఆ స్ఫూర్తితో ఇతర పాఠశాలల అభివృద్ధికి కూడా దాతలు ముందుకొచ్చారని చెప్పారు. టిడ్కో ప్రాంగణంలోని పాఠశాలలో 2 వేల మంది పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని, వారికి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు.

**భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాశ్వత పట్టాలు**

టిడ్కో ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ భగత్‌సింగ్ కాలనీ వాసుల సమస్యను కూడా ప్రస్తావించారు. సుమారు 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం చూపుతూ 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇప్పించామని తెలిపారు. సిటీ లో ఐదువేల మందికి శాశ్వత పట్టాలు ఇప్పించటమే లక్ష్యమన్నారు. సర్వేపల్లి కాలువకట్ట పై నివసిస్తున్న 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. జాఫర్ సాహెబ్ కాలువకట్ట వాసుల సమస్యని కూడా పరిష్కరిస్తామని తెలిపారు. గత గొడ్డలి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల విషయంలో కూడా గందరగోళం సృష్టించిందని విమర్శించారు. మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ తన తండ్రి నారాయణ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. పేదరికం నుంచి వచ్చిన ఆయన పేదల కష్టాలను స్వయంగా అనుభవించారని, అందుకే పేద పిల్లలకు విద్యను ఆస్తిగా అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మూడు ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేశామని, దేశంలోనే ప్రత్యేకంగా నిలిచేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. తనను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామిని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. టీడీపీ అబ్జర్వర్ గురవారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయని అన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలను నిర్మించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పాఠశాలలో చదవాలంటే ప్రైవేటు రంగంలో లక్షల రూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, అలాంటి కార్పొరేట్ స్థాయి విద్యను పేద పిల్లలకు ఉచితంగా అందించేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మేయర్ సుజాత మాట్లాడుతూ మంత్రి నారాయణ చేపడుతున్న విద్యా యజ్ఞంలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆయన బాటలు వేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ కో-ఆప్షన్ సభ్యుడు జమీర్, క్లస్టర్ జహీర్, ప్రెసిడెంట్ షాహిద్ ,సిటీ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

# పదవి ఉన్నా లేకున్నా.. ప్రజలకు మేలు చేసేవారే అసలైన నాయకులు

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు(సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కోవూరు నియోజకవర్గంలో ఐదేళ్ల పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న తెలుగు దేశం పార్టీకి చెందిన ఇద్దరు జడ్పీటీసీలు, 17 మంది ఎంపీటీసీలను శనివారం నెల్లూరులోని వీపీఆర్ (కార్యాలయంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గారు మాట్లాడారు.

**ప్రజాసేవలోనే అసలైన తృప్తి**

గడిచిన ఐదేళ్ల కాలంలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ప్రజలకు అందించిన సేవలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. 'పదవీ కాలం ముగిసిన సందర్భంగా ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు పలికి, వారిని సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉంది. మనం చేసిన అభివృద్ధిని, అందించిన సేవలను ఎవరూ ప్రత్యేకంగా పొగడాల్సిన అవసరం లేదు. మనల్ని నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు మంచి చేశామనే ఆత్మసంతృప్తి మనకు ఉంటే అదే గొప్ప మెప్పు. పదవిలో ఉన్నప్పుడే కాదు.. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన, తపన మనసులో ఉన్నంత కాలం మీరు నిరంతరం నాయకులే' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమైంది**

గత ఐదేళ్ల పదవీ కాలంలో కనీసం చివరి రెండేళ్లయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా తమ ప్రాంతాల అభివృద్ధికి పనులు చేసే అవకాశం లభించిందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుర్తుచేశారు.

**స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానంలోనూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అధిష్ఠానం ఏ అభ్యర్థికి అవకాశం ఇచ్చినా, విభేదాలు లేకుండా అందరూ సమష్టిగా కృషి చేసి కూటమి జయకేతనం ఎగరేసేలా పనిచేయాలని సూచించారు.

## శ్రీ విజయ దుర్గ ఉప పీఠంలో చండీ హోమం

### నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ స్వామి

గూడూరు(సింధూరదర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా: గూడూరు పట్టణంలోని శ్రీ విజయదుర్గ ఉప పీఠం లో పౌర్ణమి సందర్భంగా అన్ని రకాల సమస్యల నివారణ కొరకు, దుర్గా సప్తశతి హోమం (చండి హోమం ), శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి మూల మంత్ర హోమం, నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.








# పోలీసుల విధుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నిబద్ధత ఎంతో ముఖ్యం

పోలీసుల త్యాగాలు ఈ సమాజం ఎప్పటికీ మరచిపోదు - రాష్ట్ర ప్రజల రక్షణ బాధ్యతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం

శిక్షణ సమయంలో సాధించిన ఫిట్నెస్ ను చివరి వరకూ కలిగి ఉండాలి - పోలీసు వ్యవస్థతో మా కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంది

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి - పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఘనంగా దీక్షాంత్ పరేడ్ కార్యక్రమం



నెల్లూరు (సింధూరదర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; రాష్ట్ర ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, విధి నిర్వహణలో సేవాభావం, విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత పరేడ్ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి ఎస్పీ అజిత వేజెండ్ల, ఏఎస్పీలు సౌజన్య, దీక్ష ఘన స్వాగతం పలికారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అతిథుల కరతాళ ధ్వనుల మధ్య పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన మంత్రి ఆనం పరేడ్ ను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో నిర్వహించిన పోలీసు పాసింగ్ అవుట్ దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా గతంలో తాను పాల్గొన్న పోలీసు పరేడ్‌లు, పోలీసుల గౌరవ వందనాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. పోలీసు కానిస్టేబుళ్లకు ఇంత గొప్పగా శిక్షణ అందించడంలో కృషి చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. తాను ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో పోలీసు శిక్షణ కళాశాల ఏర్పాటుకు 13.5 ఎకరాల స్థలాన్ని 2005లో పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ శిక్షణ కేంద్రం నుంచి సుమారు 805 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 176 మంది శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర ప్రజల రక్షణలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రధానంగా పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఉండేవారని, ప్రస్తుతం డిగ్రీలు, ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడా పోలీసు శాఖలోకి వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పోలీసు విధులు కేవలం రక్షణకే పరిమితం కాకుండా ప్రజలకు సేవ చేయడంలోనూ కీలకమని అన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన, సైబర్ నేరాల నియంత్రణ వంటి వివిధ అంశాల్లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు పోలీసులకు ప్రత్యేక శిక్షణ అందించడం ఎంతో అవసరమని తెలిపారు.

తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చానని మంత్రి పేర్కొన్నారు. ఒక పోలీసు అధికారికి మనవడిగా, మరో పోలీసు అధికారికి తమ్ముడి కొడుకుగా, ఇద్దరు హోం మంత్రుల కుటుంబాలతో అనుబంధం ఉన్న వ్యక్తిగా పోలీసు వ్యవస్థతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో పోలీసు పరేడ్‌లలో పాల్గొన్న సందర్భాలను మంత్రి గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అనేక ప్రధాన శాఖల్లో పోలీసు శాఖకు ప్రత్యేకమైన బాధ్యతలు, విధులు ఉన్నాయని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల రక్షణ బాధ్యతలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ సమాజ రక్షణకు అంకితమయ్యే పోలీసు ఉద్యోగంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల త్యాగం ఎంతో గొప్పదని అన్నారు. శిక్షణ సమయంలో సాధించిన ఫిట్‌నెస్‌ను ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొనసాగించాలని మంత్రి సూచించారు. ఒక పోలీసు అధికారి క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, కమిట్‌మెంట్ అతని శారీరక దారుఢ్యంలో కూడా ప్రతిబింబిస్తాయని అన్నారు. 30 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేసిన తర్వాత కూడా ఇదే స్థాయి ఫిట్‌నెస్‌ను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. శిక్షణను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ, ప్రిన్సిపాల్ సౌజన్య, డీఎస్పీ,వైస్ ప్రిన్సిపాల్ గిరిధరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు. అలాగే అభ్యర్థులకు విజయవంతంగా శిక్షణ అందించిన పోలీసు అధికారులకు కూడా మంత్రి జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సిఐలు, పలువురు పోలీస్ అధికారులు, పోలీసు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ట్రైనింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలి

## కమిషనర్ వై ఓ. నందన్

నెల్లూరు ( సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరగనున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కమిషనర్/అడిషనల్ ఎలక్షన్ ఆఫీసర్ వై.ఓ నందన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 72 డివిజన్లకు సంబంధించిన సమగ్ర ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రకటించామని, నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్ల వివరాలపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. డివిజన్ల వారీగా వివిధ ప్రభుత్వ పాఠశాలలు ఇతర కార్యాలయాలను గుర్తించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని వసతులతో కూడిన నూతన పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు అందజేయాలని సూచించారు. ఓటర్ల నిష్పత్తికి తగ్గట్టుగా వివిధ డివిజన్లకు అవసరమైన నూతన పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలని, అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రఘునాథరావు, ఎన్నికల లైజనింగ్ అధికారి రాజేంద్రప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్ట్ తయారీ పై అవగాహన

## డిప్యూటీ ఎంపీడీవో మోహన్



గూడూరు( సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు మండల పరిధిలోని పాలిచర్ల గ్రామంలోనీ సాలిడ్ వెల్త్ ప్రాసెస్ కేంద్రంలో వర్మీ కంపోస్ట్ తయారీ పై డిప్యూటీ ఎంపిడిఓ మోహన్ , పి.డి. ఓ లు , గ్రీన్ అంబాసిడర్లకు వర్మీ కంపోస్ట్ తయారీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాన పాములు , సూక్ష్మ జీవుల సహాయంతో కూరగాయల వ్యర్థాలు , పేడను సేంద్రియ పదార్థాలను కుళ్ళింప చేసి తయారు చేసే సహజమైన ఎరువు వర్మీ కంపోస్ట్ అన్నారు. దీనినీ పంచాయతీ అభివృద్ధి ఎలా తయారు చేసుకోవాలో పంచాయతీ అభివృద్ధి అధికారులకు , గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు , పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# వేపదరువులో 40 లక్షల నుడా నిధులతో నూతనపార్కు ప్రారంభం

వైభవంగా ఆనం వివేకా విగ్రహావిష్కరణ

40 లక్షలతో మోడల్ పార్కు ప్రారంభించిన మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి

పార్కుల్లో రూపాయికే ఏసీ కమ్యూనిటీ హాళ్లు.. 2028 నాటికి నెల్లూరును మోడల్ సిటీగా మారుస్తాం

పురపాలక శాఖ మంత్రి నారాయణ

రాజకీయాల్లో పోటీ చేసిన ప్రతిసారీ గెలిచిన అజాతశత్రువు వివేకా అన్న..

అభిమానుల గుండెల్లో సదా సజీవం: ఆనం రామనారాయణ రెడ్డి

కక్ష సాధింపులకు స్వస్తి చెప్పాం.. కూటమి పాలనలో జిల్లా అభివృద్ధిపైనే పూర్తి దృష్టి

నుడా చెర్మన్ కోటంరెడ్డి




నెల్లూరు( సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరులో స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి విగ్రహావిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది..14వ డివిజన్ వేపదరువు వద్ద 40 లక్షల నుడా నిధులతో అభివృద్ధి చేసిన నూతన పార్కును మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ కలసి ప్రారంభించారు..ఈ సందర్భంగా నెల్లూరు ప్రజలకు శుభవార్త తెలిపిన మంత్రి నారాయణ... నగరంలోని పార్కుల్లో ఏసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మించి, పేదలకు కేవలం ఒక్క రూపాయి అద్దెకే అందిస్తామని ప్రకటించారు. అంతేకాదు, 2028 నాటికి నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.. ఇక తమ్ముడి రాజకీయ భవిష్యత్తు కోసం తనకు దక్కాల్సిన మంత్రి పదవిని సైతం త్యజించిన గొప్ప మనసు వివేకా అన్నదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అత్యంత భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు..ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ తమ్ముడి కోసం పదవులను త్యజించిన వివేకాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, 2014లో 5,300 కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు.. సిటీలో ఆధునీకరిస్తున్న 50 పార్కుల్లో ఇప్పటికే 45 పార్కులను అందుబాటులోకి తెచ్చామని, పార్కులలో ఏసీ కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేసి పేదలకు కేవలం 1 అద్దెకే అందిస్తామని, యుజీడి పనులు పూర్తి చేసి దోమలు లేని నగరంగా, ప్రతి 5 మీటర్లకు ఒక చెట్టు నాటి గ్రీన్ సిటీగా, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఇస్తామన్నారు..అంతేకాకుండా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం 50,000 కోట్లు మంజూరు చేశారని, 2028 కల్లా నెల్లూరును మోడల్ సిటీగా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వివేకానందరెడ్డి రాజకీయాల్లో ఏ ఎన్నికల్లో పోటీ చేసినా విజయం సాధించిన అజాతశత్రువు అని, నెల్లూరుకి దూరం కాకూడదనే ఉద్దేశంతో తనకు 3 సార్లు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నా నా కోసం వద్దనుకొని త్యాగం చేశారని, తన రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టు వేసిన వివేకా అన్న భౌతికంగా లేకపోయినా అభిమానుల గుండెల్లో సజీవంగా ఉన్నారన్నారు.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తాను ప్రస్తుతం ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, నగర అభివృద్ధికి మంత్రి నారాయణ అహర్నిషలు కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 10వ వార్డు కౌన్సిలర్‌గానే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వివేకా స్మారకార్థం మంత్రి నారాయణ సహకారంతో నుడా ద్వారా పార్కు నిర్మించి, అందులో నెట్‌బాల్స్, సెపెక్ తక్రా వంటి నూతన క్రీడా సౌకర్యాలు లభ్యమయ్యేలా చేశామని.. కక్ష సాధింపులకు స్వస్తి చెప్పి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టామని, కూటమి పాలనలో రాష్ట్రంలో మరో 25 ఏళ్లు టిడిపి అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,ఆనం రంగమయూర్ రెడ్డి,ఆనం శుభకర్ రెడ్డి,టీడీపీ నెల్లూరు సిటీ అబ్జర్వర్ గురవారెడ్డి,రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్,బీజేపీ నేత సురేంద్ర రెడ్డి ,మధు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా అంగన్వాడి ఉత్సవం కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి**

కందుకూరు సింధూర దర్శిని: సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా, కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు, కందుకూరు పట్టణంలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు మట్టం శ్రావణిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుకలో భాగంగా సమాజంలో చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహార పంపిణీ మరియు ప్రాథమిక విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు .అంగన్‌వాడీ కేంద్రం లోని సిబ్బందికి కందుకూరు నియోజకవర్గ తెలుగు మహిళా నాయకులు మరియు ఐసిడిఎస్ సిడిపిఓ సూపర్వైజర్లతో కలిసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు మరియు పిల్లల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సేవలను కొనియాడారు.

# పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు మట్టం శ్రావణిరెడ్డి**




కందుకూరు (సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వ తేదీన ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలం,రామాపురం గ్రామానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదల. పవన్ కళ్యాణ్ వస్తున్న సందర్భంగా జనసమీకరణలో భాగంగా కందుకూరు నియోజకవర్గశీ నుండి 10,000 మందిని తీసుకొచ్చే విధంగా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్దలు మరియు మాజీ మంత్రి దేవినేని. ఉమామహేశ్వరరావు పరిశీలకులుగా ఏర్పాటు చేసిన నాయకులు మరియు కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడటం జరిగిందని తెలిపారు.

# వైసీపీ అసత్య ప్రచారాలను 'జెన్-జీ' నమ్మదు

**నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



ఉదయగిరి( సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ఉదయగిరి, కోవూరు నియోజక వర్గాల్లో శనివారం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన 'యువత భవితకు భరోసా' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు లోని నేతాజీ డిగ్రీ కళాశాల, కోవూరు నియోజక వర్గం నార్తరాజుపాళెంలోని శశికాంత్ ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థులతో ఎంపీ నేరుగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా చేపట్టిన డీఎస్సీ ప్రక్రియపై వైసీపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తూ యువత ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని ఎంపీ గారు విమర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన నేరుగా సమాధానాలిచ్చారు.

**విద్యార్థుల సమస్యలకు తక్షణ పరిష్కారం**

నేతాజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వరికుంట పాడు నుంచి జంగంరెడ్డి పల్లికి కిలోమీటరు రోడ్డు నిర్మించాలని ఓ విద్యార్థిని కోరగా, ఎంపీ వేమిరెడ్డి తక్షణమే స్పందించారు. ప్రభుత్వం తరఫున కానీ, లేదా వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కానీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొండాపురం నుంచి వింజమూరుకు బస్సు సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థులు తెలపగా, వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సదుపాయం కల్పిస్తామని స్పష్టం చేశారు.

**విద్యార్థుల ప్రశ్నలు**
**- ఎంపీ వేమిరెడ్డి స్పష్టమైన సమాధానాలు**

**ఉద్యోగావకాశాలు - కూటమి విజన్**

ఉద్యోగాలు అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాదని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రైవేట్ రంగంలోనూ భారీగా ఉద్యోగాలు సృష్టిస్తున్నామని ఎంపీ తెలిపారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ఇప్పటివరకు 7 లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇటీవలే దాదాపు 2 వేల పోలీసు ఉద్యోగాలు, 900 ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల అయ్యాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని తెలిపారు.

**పారదర్శకంగా డీఎస్సీ.. స్పష్టమైన ఆధారాలు**

డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాపై వైసీపీ చేస్తోన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. టీసీఎస్ ఐయాన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా, 42 వేల ప్రశ్నల బ్యాంక్ నుంచి రాండమైజేషన్ పద్ధతిలో అత్యంత పారదర్శకంగా పరీక్ష నిర్వహించామని చెప్పారు. అర్హత సాధించిన ఉపాధ్యాయులే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఆధారాలు చూపిస్తున్నారని గుర్తుచేశారు. కష్టపడి మెరిట్ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై దాడి చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

**వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ స్కామ్**

వైసీపీ పాలనలో ఏపీపీఎస్సీ జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రైవేట్ రిసార్టుకు తీసుకెళ్లి 84రోజులు ఉంచారని ఇన్వెస్టిగేషన్‌లో తేలింద న్నారు. ఫోరెన్సిక్ తనిఖీల్లో 97 శాతానికి పైగా ఆన్సర్ షీట్లలో అక్రమ దిద్దుబాట్లు జరిగాయని ఎంపీ వెల్లడించారు. గతంలో ఇంత పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన వారు, నేడుస్వచ్ఛమైన కూటమి పాలనపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు.

**జెన్-జీ' కూటమి ప్రభుత్వానికే మద్దతు**

వైసీపీ తమ తప్పుడు ప్రచారాల కోసం 'జెన్-జీ' ని వాడుకోవాలని చూసిందని, అయితే నేటి యువతకు ప్రశ్నించే తత్వంతో పాటు 40ఏళ్ల విజన్ ఉన్న చంద్రబాబు అభివృద్ధిపై పూర్తి నమ్మకం ఉందని ఎంపీ తెలిపారు. యువత అంతా స్పష్టమైన దృక్పథంతో కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిందన్నారు.

**నెల్లూరు జిల్లాలో ఉపాధి అవకాశాలు**

జిల్లాకు బీపీసీఎల్ , క్రిస్ సిటీ , ఇఫ్కో కిసాన్ సెజ్, ఇండోసోల్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ క్లస్టర్లు రాబోతున్నాయని ఎంపీ తెలిపారు. ఇండస్ట్రియల్ ఈకోసిస్టమ్ ద్వారా స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు, స్కిల్స్, బిజినెస్ అవకాశాలు లభిస్తాయ న్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందిం చేందుకు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

**వీపీఆర్ ఫౌండేషన్ సేవలు**

'వీపీఆర్ విద్య' ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు, 'వీపీఆర్ నేత్ర' ద్వారా ఇప్పటివరకు ఒక లక్ష ముప్పై వేల మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు చేసి, దాదాపు 70 వేల మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి వచ్చాక సమాజానికి తిరిగి సేవ చేయాలనే ఆలోచనతోనే వీపీఆర్ ఫౌండేషన్ ప్రారంభించామని వివరించారు. నేటి యువత నిబద్ధతతో, కష్టపడి పనిచేస్తూ సమాజానికి సాయపడే గుణాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

# అట్టహాసంగా పల్లె పండుగ 3.0

**12వేల కోట్లతో వీబీజీ రాంజీ పనులకు శ్రీకారం చుట్టనున్న సీఎం, డిప్యూటీ సీఎం**

**లక్ష మందితో భారీ బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు**

**ఏర్పాట్లపై అధికారులతో సమావేశమైన రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్**



నెల్లూరు (సింధూర దర్శిని) 26 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; వరికుంటపాడు మండలం రామాపురం వద్ద ఈ నెల 29న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొననున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెల్లూరు నగరంలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కృష్ణా రెడ్డి, కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఉగ్ర నరసింహా రెడ్డి, ఏలూరి సాంబశివరావు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 29న వరికుంటపాడు మండలం రామాపురం వద్ద నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో మంచినీరు, ఆహారం, రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాఖల వారీగా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ఈ నెల 29న జిల్లాలో పల్లె పండుగ 3.0ను పెద్ద పండుగగా నిర్వహించనున్నామని, లక్ష మందితో భారీ బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమష్టిగా పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో కడప ఎయిర్‌పోర్ట్ నూతన టర్మినల్: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు





కడప సింధూరదర్శిని: కడప విమానాశ్రయంలో చేపట్టిన నూతన డొమెస్టిక్ టర్మినల్ భవన నిర్మాణ పనులను అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యున్నత నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రాష్ట్ర మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎంపీ సీఎం సురేష్ నాయుడు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌లతో కలిసి ఎయిర్‌పోర్ట్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యార్థం దేశీయ విమానాశ్రయాలను అత్యాధునిక హంగులతో కేంద్రం తీర్చిదిద్దుతోందని, పర్యావరణానికి విఘాతం కలగకుండా పనులు వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పురోగతిని వివరిస్తూ.. సుమారు రూ. 266 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన టర్మినల్ పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని మంత్రికి తెలిపారు. 16,455చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ నూతన భవనం ద్వారా రద్దీ సమయాల్లో గంటకు 1,800 మంది, ఏటా దాదాపు 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. రాత్రి వేళల్లోనూ విమానాల రాకపోకలకు వీలుగా నైట్ ల్యాండింగ్ సదుపాయంతో పాటు 24 చెక్-ఇన్ కౌంటర్లు, 3 ఏరో బ్రిడ్జిలు, ఏకకాలంలో ఏడు కోడ్-సి విమానాలను నిలిపే పార్కింగ్ బేలు అందుబాటులోకి వస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉడాన్ పథకం కింద ఆధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకుం టున్న ఈ విమానాశ్రయం మరియు మెరుగవుతున్న రహదారి అనుసంధానం వల్ల జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు



## బాలాపూర్ రికార్డు బద్దలు..

దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!

దక్కించుకున్న స్థానిక భక్తుడు రాజేష్

ఇక్కడే మరో లడ్డూకు రూ.25 లక్షలు

వేలం నిర్వహించిన జై గణేశ్ యూత్ అసోసియేషన్

వేలం నిధులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్న నిర్వాహకులు

హైదరాబాద్ సింధూరదర్శిని:భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌తో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు చెల్లించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది. ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన నిధులను సామాజిక, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని జై గణేశ్ యూత్ అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు.

## గోల్డ్ లోన్లకు బ్రేక్.. పర్సనల్ లోన్లకు మళ్లీ డిమాండ్!

మళ్లీ వేగం పుంజుకున్న పర్సనల్ లోన్లు

రూ.18.6 లక్షల కోట్లకు చేరిన గోల్డ్ లోన్లు

30 శాతం పెరిగిన ఎన్‌బీఎఫ్‌సీల వ్యక్తిగత రుణాలు

1.8 శాతానికి తగ్గిన పర్సనల్ లోన్ బకాయిలు

పర్సనల్ లోన్ల వేగంగా పెరగొచ్చని యూబీఎస్ అంచనా



ఒకప్పుడు అత్యవసర ఖర్చులకు వెంటనే డబ్బు కావాలంటే చాలామంది బంగారాన్ని తాకట్టు పెట్టేవారు. ఇటీవలి కాలంలో బంగారం ధరలు భారీగా పెరగడంతో గోల్డ్ లోన్లకు డిమాండ్ మరింత పెరిగింది. ఇప్పుడు పరిస్థితి మళ్లీ మారుతున్నట్లు కనిపిస్తోంది. పర్సనల్ లోన్లు వేగం పుంజుకుంటున్నాయి. త్వరలో గోల్డ్ లోన్లను దాటి అత్యంత వేగంగా పెరుగుతున్న రుణ విభాగంగా మారొచ్చని యూబీఎస్ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక చెబుతోంది.

**గోల్డ్ లోన్లకు ఎందుకు ఇంత డిమాండ్?**

బంగారం ధరలు పెరగడం గోల్డ్ లోన్లకు ప్రధానంగా కలిసొచ్చింది. 2025-26లో గోల్డ్ లోన్లు దాదాపు 50 శాతం పెరిగి రూ.18.6 లక్షల కోట్లకు చేరాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో వీటి వాటా కూడా 2018-19లో ఉన్న ఒక శాతం నుంచి ఇప్పుడు ఐదు శాతానికి పెరిగింది.

బంగారం ధరలు పెరగడంతో ప్రజలు తమ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి ఎక్కువ మొత్తంలో రుణం పొందే అవకాశం వచ్చింది. దీంతో గోల్డ్ లోన్ వ్యాపారం వేగంగా విస్తరించింది. అయితే ఇప్పుడు బంగారం ధరల పెరుగుదల కొంత స్థిరపడటంతో ఈ వేగం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

**పర్సనల్ లోన్లు ఎందుకు పుంజుకున్నాయి?**

గత రెండేళ్ల కాలంలో పర్సనల్ లోన్ల వృద్ధి నెమ్మదించింది. రుణ నిబంధనలు కఠినం కావడం, ఇప్పటికే ఎక్కువ అప్పులు తీసుకున్నవారి సంఖ్య పెరగడం ఇందుకు కారణాలుగా నివేదిక పేర్కొంది.

ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఆగస్టు వరకు ఎన్‌బీఎఫ్‌సీల (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ) పర్సనల్ లోన్లు ఏడాది ప్రాతిపదికన దాదాపు 30 శాతం పెరిగాయి. బ్యాంకుల్లో తొమ్మిది శాతం వృద్ధి నమోదైంది. రెండు విభాగాల్లోనూ రెండేళ్లలో ఇదే అత్యంత వేగమైన వృద్ధి.

**ఎవరి రుణాల్లో సమస్యలు తగ్గుతున్నాయి?**

పర్సనల్ లోన్ల విషయంలో మరో సానుకూల మార్పు కనిపిస్తోంది. 30 రోజుల్లోపు బకాయిలుగా మారిన వ్యక్తిగత రుణాల వాటా 2024 జూన్‌లో 3.5 శాతం ఉండగా.. 2026 ఆగస్టుకు 1.8 శాతానికి తగ్గింది. అదే సమయంలో గోల్డ్ లోన్లలో బకాయిలు పెరిగాయి. మార్చిలో 0.7 శాతంగా ఉన్న ఈ రేటు ఆగస్టుకు 2.6 శాతానికి చేరింది.

**ఎన్‌బీఎఫ్‌సీల వాటా కూడా పెరిగింది**

గోల్డ్ లోన్ మార్కెట్‌లో ఎన్‌బీఎఫ్‌సీలు కూడా భారీగా విస్తరించాయి. 2017-18లో ఈ విభాగంలో వాటా మూడు శాతంగా ఉండగా.. ఆగస్టు నాటికి 20 శాతానికి చేరింది. అయితే బంగారం ధరల పెరుగుదల ప్రభావం తగ్గుతున్న నేపథ్యంలో ఇకపై వాటి మార్కెట్ వాటా పెరుగుదల వేగం తగ్గొచ్చని నివేదిక అంచనా వేసింది.

**వడ్డీ రేట్లు పెరిగినా?**

వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉన్నా పర్సనల్ లోన్ల వృద్ధి పూర్తిగా ఆగిపోదని నివేదిక అంచనా వేసింది. 2026 చివరి నాటికి వడ్డీ రేట్ల పెంపు మొత్తం 50 బేసిస్ పాయింట్లకు పరిమితం కావొచ్చని పేర్కొంది. డెరివేటివ్స్ మార్కెట్ మాత్రం 100 బేసిస్ పాయింట్ల పెంపును అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

# ఉదయం లేవగానే ఫోన్ చూడొద్దు.. 5 నిమిషాలు ఇలా చేస్తే రోజంతా ప్రశాంతంగా!

శ్వాసపై దృష్టి పెట్టి ప్రశాంతంగా కూర్చోవాలి - సహజంగా వచ్చే ఆలోచనలను ఆపొద్దు

చుట్టూ వినిపించే శబ్దాలను గమనించాలి - శరీరంలో ఒత్తిడి ఉందో లేదో గుర్తించాలి

5 నిమిషాలు కుదరకపోతే 2 నిమిషాలతో మొదలుపెట్టొచ్చు

ఉదయం నిద్ర లేవగానే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది ఫోనే. ఒక్కసారి స్క్రీన్ ఆన్ చేస్తే చాలు.. మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, వార్తలు, సోషల్ మీడియా పోస్టులు వరుసగా మన దృష్టిని ఆకర్షిస్తాయి. మన రోజు మొదలయ్యేలోపే మనసు ఎన్నో విషయాలతో నిండిపోతుంది. అయితే.. ఫోన్ అందుకునే ముందు కేవలం ఐదు నిమిషాలు ప్రశాంతంగా గడిపితే ఎలా ఉంటుంది? పెద్దగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. మెడిటేషన్ యాప్ అవసరం లేదు. ప్రత్యేకమైన మ్యూజిక్ కూడా అక్కర్లేదు. ఆ ఐదు నిమిషాలు స్క్రీన్‌కు దూరంగా ఉంటే చాలు.



**మనసుకు సమయం ఇవ్వండి**

సౌకర్యంగా కూర్చోండి. ఫోన్‌ను కాస్త దూరంగా పెట్టండి. కళ్లు మూసుకోవచ్చు లేదా కిటికీలోంచి బయటకు చూడొచ్చు. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ దానిపై కాసేపు దృష్టి పెట్టండి. మనసులో ఆలోచనలు రావడం సహజమే. ఏదైనా పని గుర్తొచ్చినా, రోజు గురించి ఆలోచించినా ఇబ్బంది లేదు. ఆ ఆలోచనను బలవంతంగా ఆపాల్సిన అవసరం లేదు. మళ్లీ శ్వాసపై లేదా చుట్టూ వినిపించే శబ్దాలపై దృష్టి పెట్టండి.

**మొదట్లో ప్రశాంతంగా అనిపించకపోవచ్చు**

మొదటి రోజే మనసు ప్రశాంతంగా అయిపోతుందని అనుకోవద్దు. పెండింగ్ పని గుర్తుకు రావచ్చు. ఎవరికో పంపాల్సిన మెసేజ్ గుర్తు రావచ్చు. ఆఫీస్ పని గురించి ఆలోచనలు మొదలవ్వొచ్చు. ఐదు నిమిషాలు ఎప్పుడు పూర్తవుతాయో కూడా చూడాలనిపించొచ్చు.

ఇదంతా సహజమే. మైండ్‌ఫుల్‌నెస్ అంటే అసలు ఆలోచనలు లేకుండా కూర్చోవడం కాదు. మన దృష్టి ఎక్కడికి వెళ్లిందో గుర్తించి.. దాన్ని మెల్లగా ప్రస్తుత క్షణంపైకి తీసుకురావడం.

మైండ్‌ఫుల్‌నెస్ ఆధారిత విధానాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడొచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వివిధ అధ్యయనాల్లో ఫలితాలు ఒకేలా లేవని, నిర్దిష్ట పద్ధతులు, ఫలితాలపై మరింత పరిశోధన అవసరమని పరిశోధకులు చెబుతున్నారు.

**ఇలా ప్రయత్నించండి**

మొదటి నిమిషం: ప్రశాంతంగా కూర్చొని సహజంగా శ్వాస తీసుకోండి.

తర్వాత రెండు నిమిషాలు: చుట్టూ వినిపించే శబ్దాలను గమనించండి. పక్షుల శబ్దం, వాహనాల శబ్దం, ఫ్యాన్ శబ్దం.. ఏదైనా కావచ్చు.

నాలుగో నిమిషం: మీ శరీరం ఎలా ఉందో గమనించండి. భుజాలు బిగుసుకున్నాయా? దవడ దగ్గర ఒత్తిడి ఉందా? ఇంకా నిద్ర మత్తు ఉందా?

చివరి నిమిషం: ఆ రోజు మీరు సాధించాలనుకునే ఒక్క విషయాన్ని గుర్తు చేసుకోండి. పెద్ద లక్ష్యం కావాల్సిన అవసరం లేదు. ఓ ముఖ్యమైన పని పూర్తి చేయడం కావచ్చు. ఎవరి మీదా తొందరపడకుండా మాట్లాడటం కావచ్చు.

**ఆ తర్వాత ఫోన్ తీసుకోండి.**

ఐదు నిమిషాలే.. కానీ క్రమం మారుతుంది. ఇక్కడ ముఖ్యమైన విషయం ఐదు నిమిషాల వ్యవధి కాదు. నిద్ర లేవగానే ప్రపంచం నుంచి సమాచారం తీసుకోవడం కంటే ముందు.. మీకు మీరు కొంత సమయం ఇవ్వడం. రోజూ ఐదు నిమిషాలు సాధ్యంకాకపోతే రెండు నిమిషాలతో మొదలుపెట్టొచ్చు. కుర్చీలో కూర్చున్నా సరే. కిటికీ దగ్గర ఉన్నా సరే. ధ్యానం కోసం ప్రత్యేకమైన ప్రదేశం, పరుపు, సువాసన కొవ్వొత్తులు అవసరం లేదు. ఉదయం లేచిన వెంటనే ప్రతిదానికీ స్పందించకుండా.. కాసేపు ఆగడం మాత్రమే ఈ చిన్న అలవాటు ఉద్దేశం. కొన్ని రోజుల తర్వాత ఆ ప్రశాంతమైన ఐదు నిమిషాల కోసం మీరు ఎదురుచూసే సమయం రావచ్చు.

# రోలర్ కోస్టర్ రైడ్ వల్ల మెదడుపై ప్రభావం ఉంటుందా?

కాలిఫోర్నియాలో ఎక్స్2 రోలర్ కోస్టర్‌పై కేసులు - 100 మందికిపైగా గాయాలైనట్లు ఫిర్యాదులు

రైడ్‌లో వేగం, ఆకస్మిక మలుపుల వల్ల మెడ, మెదడుపై ప్రభావం

తల వేగంగా కదలడం వల్ల మెదడుపై ఒత్తిడి - అరుదుగా మెదడులో రక్తస్రావం

ఒక్కసారిగా ఆకాశంలోకి దూసుకెళ్లడం.. క్షణాల్లో కిందికి జారిపడటం.. మలుపుల మీద మలుపులు తిరగడం.. ఇదే రోలర్ కోస్టర్ థ్రిల్. కానీ అదే వేగం, అదే ఉత్కంఠ కొన్నిసార్లు శరీరంపై తీవ్ర ప్రభావం చూపొచ్చు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ రోలర్ కోస్టర్‌పై వచ్చిన ఫిర్యాదులు ఇప్పుడు ఈ అంశంపై మళ్లీ చర్చకు తెరతీశాయి.

**100 మందికి పైగా ఫిర్యాదులు**

కాలిఫోర్నియాలోని సిక్స్ ఫ్లాగ్స్ మ్యాజిక్ మౌంటెన్‌లో ఉన్న 'ఎక్స్2' రోలర్ కోస్టర్‌పై పలువురు కేసులు వేశారు. ఈ రైడ్ కారణంగా మెదడుకు గాయాలయ్యాయని బాధితులు ఆరోపించారు. 100 మందికిపైగా ఇదే తరహా సమస్యలను నివేదించినట్లు వారి తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. జులై 12నుంచి ఈ రైడ్‌ను మూసివేశారు. కొంతమంది తీవ్ర తలనొప్పి, అయోమయం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలతో ఆసుపత్రికి వెళ్లారు. ఓ మహిళకు మెదడులో రక్తస్రావం జరగడంతో అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది.



**అసలు గాయం ఎలా అవుతుంది?**

రోలర్ కోస్టర్‌లో వేగం ఒక్కసారిగా పెరగడం, వెంటనే తగ్గడం సాధారణమే. దీంతో తల కూడా వేగంగా కదులుతుంది. ముఖ్యంగా తల ముందుకు, వెనక్కి, పక్కలకు బలంగా కదలడం మెదడుపై ఒత్తిడిని పెంచుతుంది. కొన్ని రైడ్లలో సీట్లు కూడా తిరుగుతుంటాయి. ఎక్స్2లో ప్రయాణికుల సీట్లు 360 డిగ్రీలు తిరుగుతూ ముందుకు సాగుతాయి. ఇలాంటి భ్రమణ కదలికలు తలపై అదనపు ప్రభావం చూపొచ్చు.

**మెదడులో రక్తస్రావం.. అరుదైన ముప్పు**

చాలా సందర్భాల్లో తీవ్రమైన సమస్యలు కనిపించకపోయినా, అరుదుగా మెదడు చుట్టూ రక్తస్రావం, రక్తనాళాలకు గాయాల వంటి సమస్యలు నమోదయ్యాయి. రక్తనాళం చిట్లితే రక్తం గడ్డకట్టి స్ట్రోక్‌కు దారితీసే అవకాశం కూడా ఉంటుంది.

మెడ, వెన్నెముకకు గాయాలు కూడా సంభవించొచ్చు. ముఖ్యంగా మెడ సమస్యలు, గతంలో తలకు గాయాలు, నరాల సంబంధిత సమస్యలు ఉన్నవారు హై-ఇంటెన్సిటీ రైడ్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

**రైడ్ తర్వాత ఈ లక్షణాలుంటే?**

రోలర్ కోస్టర్ నుంచి దిగిన తర్వాత తీవ్రమైన తలనొప్పి, పదేపదే వాంతులు, తల తిరగడం, అయోమయం, స్పృహ కోల్పోవడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత, మాట తడబడటం, చూపు సమస్యలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. సాధారణంగా వచ్చేదే అనుకుని నిర్లక్ష్యం చేయకూడదు. థ్రిల్ కోసం రైడ్ ఎక్కే ముందు పార్క్ నిర్వాహకులు ఇచ్చే వయసు, ఎత్తు, ఆరోగ్య హెచ్చరికలను తప్పకుండా పాటించడం మంచిది.

# లెక్కలేనంత మంది వైసీపీ నేతలపై కేసులు పెట్టారు: అంబటి రాంబాబు

విజయవాడ సింధూరదర్శిని: డీఎస్పీ అక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు వినతిపత్రం అందించారు. ఘటనకు సంబంధం లేని వారిపై కూడా కేసులు పెట్టారని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ... లెక్కలేనంత మంది వైసీపీ నేతలపై కేసులు పెట్టారని అన్నారు. నిరసన సమయంలో పోలీసులు మితిమీరిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. విజయవాడలో మల్లాది విష్ణు ధర్నా చేస్తే ఆయనపై కోడిగుడ్లతో దాడి చేశారని... దాడి చేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టలేదని మండిపడ్డారు.



కోర్టులు అక్షింతలు వేసిన పోలీసుల తీరు మారడం లేదని అంబటి విమర్శించారు. తప్పుడు కేసులు పెడుతూ పోలీసులు అభాసుపాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై రౌడీషీట్లు తెరవడం ఏ ప్రాతిపదికన జరుగుతోందని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ మామాళ్ల దందా నడిపిస్తున్నారని... ఆయనపై కూడా రౌడీషీట్ పెట్టాలని అన్నారు.

# నాకు 2027 ప్రపంచకప్పే ఆఖరిది.. గెలిచేందుకు ఏమైనా చేస్తా: కోహ్లీ

**2027 వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ప్రకటించిన కోహ్లీ - కప్ గెలిచేందుకు ఎంతకైనా సిద్ధమని, అదే తనకు ప్రేరణ అని స్పష్టీకరణ**

**50 ఓవర్ల ఫార్మాట్ ఉత్కంఠ చాలా ఎక్కువన్న విరాట్ - వెస్టిండీస్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌కు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగబోయే ఐసీసీ వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో ఆఖరిదని స్పష్టం చేశాడు. ఆ మెగా టోర్నీని గెలిచి, కెరీర్‌ను ఘనంగా ముగించడమే తన లక్ష్యమని, దానికోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో మాట్లాడుతూ కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్ ప్రాముఖ్యతను వివరిస్తూ కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఉండే ఉత్కంఠ మరే టోర్నీలోనూ ఉండదు. ఒకే రోజులో దాదాపు రెండున్నర టీ20 మ్యాచ్‌లు ఆడినంత శ్రమ ఉంటుంది. ఆ తీవ్రతను దాదాపు 10 మ్యాచ్‌ల పాటు విదేశీ గడ్డపై కొనసాగించడం చాలా పెద్ద విషయం. అది శారీరకంగా, మానసికంగా ఎంతో పరీక్షిస్తుంది" అని కోహ్లీ వివరించాడు. "భారత్ తరపున నేను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదే. అదే నాకు గొప్ప ప్రేరణ. నా సర్వస్వాన్ని పణంగా పెట్టి ఆడాలనుకుంటున్నాను. ప్రపంచకప్ గెలవడమే మా అంతిమ లక్ష్యం. దానికోసం ఎలాంటి త్యాగానికైనా నేను సిద్ధం" అని విరాట్ అన్నాడు. ప్రపంచకప్ చరిత్రలో కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 37 వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లలో 59.83 సగటుతో 1,795 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు ఉన్నాయి. తన మొత్తం వన్డే కెరీర్‌లో 302 ఇన్నింగ్స్‌లలో 54 సెంచరీలతో 14,941 పరుగులు సాధించాడు.

ఇదే సమయంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ప్రపంచకప్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. అయితే, దీనిని తాను అసంపూర్తిగా మిగిలిపోయిన పనిగా భావించడం లేదని అన్నాడు. "నేను ఆడుతున్నంత కాలం, ముందు ఎప్పుడూ ఒక కొత్త లక్ష్యం ఉంటుంది. ఇప్పుడు నా దృష్టి రాబోయే ప్రపంచకప్‌పై ఉంది" అని రోహిత్ తెలిపాడు.

"ఐసీసీ టోర్నమెంట్‌లలో ఆడటం ఒక ప్రత్యేకమైన సవాల్. వేర్వేరు ప్రత్యర్థులతో, భిన్నమైన వేదికలపై ఆడాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా సన్నద్ధం కావాలి" అని పేర్కొన్నాడు. టీమిండియా కొత్త హోమ్ సీజన్ రేపటి వెస్టిండీస్‌తో జరిగే తొలి వన్డేతో ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. జియోహాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

# రూ.300 దర్శనం టికెట్లపై ఆ ప్రచారం నమ్మొద్దు.. భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

**భారీ డిమాండ్ వల్లే రూ.300 టికెట్ల బుకింగ్‌లో పోటీ అన్న టీటీడీ - ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా పనిచేస్తోందని వెల్లడి**

**అందుబాటులో ఉన్న కోటా కన్నా 9 రెట్లు అధికంగా టికెట్లకు డిమాండ్ అని వివరణ**

**సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి**



శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా డిమాండ్ ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. క్షణాల్లో టికెట్లు అయిపోవడాన్ని వ్యవస్థ వైఫల్యంగా భావించవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

### గణాంకాలతో వాస్తవ పరిస్థితి వెల్లడి

టికెట్ల విడుదల సమయంలో వాస్తవంగా ఏం జరుగుతుందో టీటీడీ గణాంకాలతో సహా వివరించింది. దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఒకేసారి సుమారు 6 లక్షల మంది యూజర్లు వెబ్‌సైట్‌లోకి వస్తున్నారని తెలిపింది. ఒక్కో యూజర్ సగటున తమ కుటుంబ సభ్యుల కోసం నాలుగు టికెట్లకు ప్రయత్నించినా, మొత్తం డిమాండ్ సుమారు 24 లక్షల టికెట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే, టీటీడీ విడుదల చేసే కోటా కేవలం 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే, అందుబాటులో ఉన్న ప్రతి టికెట్‌కు సగటున 9 మంది పోటీ పడుతున్నారని, ఈ తీవ్రమైన పోటీ కారణంగానే చాలా మందికి టికెట్లు లభించడం లేదని పేర్కొంది.

### వర్చువల్ క్యూ భద్రతకే, అడ్డంకి కాదు

బుకింగ్ సమయంలో భక్తులను కొంతసేపు నిరీక్షించేలా చేసే 'వర్చువల్ క్యూ' విధానంపై కూడా టీటీడీ స్పష్టత ఇచ్చింది. ఇది టికెట్లను నిరాకరించడానికి కాదని, ఒకేసారి లక్షలాది అభ్యర్థనలు వచ్చి సర్వర్లపై భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక విధానమని తెలిపింది. గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, ఆటో స్కేలింగ్, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి ఆధునిక టెక్నాలజీతో ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని, ప్రత్యేక టెక్నికల్ వార్-రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించింది. అదేవిధంగా, పేమెంట్ విఫలమవడం పూర్తిగా టీటీడీ పరిధిలోని అంశం కాదని, ఇది పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులు, యూపీఐ నెట్‌వర్క్‌ల పనితీరుపై కూడా ఆధారపడి ఉంటుందని గుర్తుచేసింది. టికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే 'స్లాట్ అన్‌అవైలబుల్' సందేశాన్ని సాంకేతిక లోపంగా పరిగణించరాదని కోరింది. శ్రీపద్మావతి అమ్మవారు, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వంటి ఇతర ఆలయాల బుకింగ్ ప్రక్రియ ఇదే వ్యవస్థ ద్వారా సజావుగా సాగుతోందని, అక్కడ డిమాండ్ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఉదహరించింది. భక్తుల ఫీడ్‌బ్యాక్ ను పరిగణనలోకి తీసుకుని, యాంటీ-బాట్ మెకానిజమ్స్, సెక్యూరిటీ, పేమెంట్ ప్రక్రియలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని టీటీడీ హామీ ఇచ్చింది. భారీ డిమాండ్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ టికెట్ లభించడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరింది. టీటీడీపై సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, భక్తులకు పారదర్శకమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# నెల జీతం రూ.1.8 లక్షలు.. అయినా ఫ్లాట్ కొనలేను: బెంగళూరు టెకీ ఆవేదన



"మంచి జీతం ఉంచే చాలు. సొంత ఇల్లు కొనుక్కోవచ్చు" అనే అంచనాలు నేటి తరానికి సరిపోయేలా లేవు. నెలకు రూ.1.8 లక్షల వేతనం వస్తున్నప్పటికీ, బెంగళూరు వంటి నగరంలో గౌరవప్రదంగా ఒక ఫ్లాట్‌ను కూడా కొనుగోలు చేయలేకపోతున్నానంటూ ఓ 25ఏళ్ల యువకుడు వ్యక్తం చేసిన ఆవేదన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది 'జెన్-జెడ్' తరం ఎదుర్కొంటున్న కఠిన వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది. బెంగళూరులో సైబర్ సెక్యూరిటీ నిపుణుడిగా పనిచేస్తున్న ఆ యువకుడు తన ఆర్థిక స్థితిగతులు, సొంతింటి కలను వివరిస్తూ ఒక పోస్ట్ చేశాడు. మధ్యతరగతి నేపథ్యం నుంచి వచ్చిన అతను, నెలకు రూ.1.8 లక్షలు సంపాదిస్తున్నప్పటికీ ఎంతో పొదుపుగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం పీజీలో నివసిస్తూ నెలకు రూ.31,000 ఖర్చు చేస్తున్నాడు. విలాసాలకు పోకుండా కారుకు బదులు స్కూటర్‌నే వినియోగిస్తున్నాడు. ప్రతి నెలా సుమారు రూ.75,000 'సిప్' రూపంలో పెట్టుబడి పెడుతూ, మిగిలిన మొత్తాన్ని పొదుపు చేస్తున్నాడు. సుమారు రూ.1.3 కోట్లతో ఒక మంచి ఇల్లు కొనవచ్చని అతను అంచనా వేశాడు. ఈ బడ్జెట్‌తో బ్రోకర్లను సంప్రదించి ఇందిరానగర్, వైట్‌ఫీల్డ్ వంటి ప్రాంతాల్లో ఇళ్లను పరిశీలించాడు. అయితే, ఆ బడ్జెట్‌లో కేవలం సాధారణ అపార్ట్‌మెంట్లలో ఇరుకైన 2బీహెచ్‌కే ఫ్లాట్లు మాత్రమే లభిస్తుండటంతో అతను తీవ్ర నిరాశకు గురయ్యాడు. మరోవైపు, వసతులున్న గేటెడ్ కమ్యూనిటీలలో ఫ్లాట్ల ధరలు రూ.2 కోట్లు దాటుతున్నాయని అతను గుర్తించాడు. పుణే వంటి నగరాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉందని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలో, మరో ఐదేళ్ల పాటు ఇలాగే పొదుపుగా జీవించాలా లేక కొత్తగా మరిన్ని పెట్టుబడులు ప్రారంభించాలా అనే గందరగోళంలో అతను ఉన్నాడు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. మెట్రో నగరాల్లో స్థిరాస్తి ధరలు ఆకాశాన్నంటాయని, చాలా మంది 35 నుండి 40 ఏళ్ల వయసు దాటాకే ఇల్లు కొనగలుగుతున్నారని కామెంట్లు చేస్తున్నారు. అధిక జీతాలు పొందుతున్నప్పటికీ, సొంత ఇల్లు అనేది నేటి యువతకు, మధ్యతరగతికి ఒక కలగానే మిగిలిపోతోందనడానికి ఈ సంఘటనే నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# రైళ్లలో గర్భిణులకు లోయర్ బెర్త్..

**ఆన్‌లైన్‌లో కేటాయించకపోయినా పొందే మార్గం ఇదే!**

**రైళ్లలో ప్రయాణించే గర్భిణులకు లోయర్ బెర్త్‌పై ప్రాధాన్యత**

**ఖాళీగా ఉన్న బెర్త్‌లను మెడికల్ సర్టిఫికెట్‌తో టీటీఈ ద్వారా పొందే వెసులుబాటు**

**గర్భిణులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ కల్పించాలని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్**

**వివిధ కోచ్‌లలో గర్భిణులు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కోటా**

రైళ్లలో ప్రయాణించే గర్భిణులకు భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం లోయర్ బెర్త్ పొందేందుకు పూర్తి హక్కు ఉంది. ఆన్‌లైన్ బుకింగ్ సమయంలో లోయర్ బెర్త్ కేటాయించకపోయినా, వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దాన్ని పొందవచ్చు. ఈ అంశంపై ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన నియమ నిబంధనలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం ఉన్న రైల్వే నిబంధనల ప్రకారం.. సీనియర్ సిటిజన్లు, 45 ఏళ్లు పైబడిన మహిళలు, గర్భిణులకు లోయర్ బెర్త్‌ల కేటాయింపులో ఆటోమేటిక్ విధానంలో ప్రాధాన్యత ఇస్తారు. స్లీపర్ క్లాస్ కోచ్‌లో దాదాపు ఆరు నుంచి ఏడు లోయర్ బెర్త్‌లను, 3ఏసీ కోచ్‌లో నాలుగు నుంచి ఐదు, 2ఏసీ కోచ్‌లో మూడు నుంచి నాలుగు లోయర్ బెర్త్‌లను ఈ కేటగిరీల కోసం ప్రత్యేకంగా రిజర్వ్ చేస్తారు. ఈ కోటా ద్వారా చాలా మందికి ప్రయాణం సులభతరం అవుతుంది. అయితే, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు గర్భిణులు నేరుగా లోయర్ బెర్త్ కోసం అభ్యర్థించేందుకు లేదా గ్యారెంటీగా పొందేందుకు ప్రస్తుతం ఎలాంటి ఆప్షన్ లేదు. ఆటోమేటిక్ అలాట్‌మెంట్‌లో లోయర్ బెర్త్ రాని గర్భిణులు, ప్రయాణానికి ముందు తమ గర్భాన్ని ధ్రువీకరించే మెడికల్ సర్టిఫికెట్‌తో సమీపంలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను సంప్రదించి అభ్యర్థించవచ్చు.

ప్రయాణం ప్రారంభమయ్యాక, ట్రైన్‌లోని ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)ని కూడా సంప్రదించవచ్చు. రద్దు కావడం వల్ల గానీ, ఇతర కారణాల వల్ల గానీ ఏదైనా లోయర్ బెర్త్ ఖాళీగా ఉంటే, టీటీఈ దానిని నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో గర్భిణులకు కేటాయించే అధికారం కలిగి ఉంటారు. ఈ ఆన్‌లైన్ సమస్యపై ఢిల్లీ హైకోర్టులో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గర్భిణులు డిజిటల్‌గా లోయర్ బెర్త్‌ను అభ్యర్థించేందుకు వీలుగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వం, రైల్వే బోర్డు, ఐఆర్‌సీటీసీలను హైకోర్టు ఆదేశించింది. రైల్వే పాలసీలో ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో దానికి తగిన సౌకర్యం లేకపోవడాన్ని కోర్టు గమనించింది. గర్భంతో ఉన్న సమయంలో పై బెర్త్‌లు ఎక్కడం కష్టంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ నిబంధనలను రూపొందించారు.

# నిమజ్జనానికి.. గణనాథుడిని పడుకోబెట్టి తీసుకెళ్లిన వైనం!

**హైదరాబాద్ గోల్నాకలో వినూత్నంగా గణేశుడి నిమజ్జనం**

**ఎత్తైన విగ్రహాన్ని వాహనంపై పడుకోబెట్టి తరలింపు**

**మార్గమధ్యలో చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు అడ్డంకిగా మారడం**

**ఇబ్బందుల వల్లే ఇలా చేయాల్సి వచ్చిందన్న నిర్వాహకులు**



హైదరాబాద్ సింధూరదర్శిని: హైదరాబాద్‌లో జరుగుతున్న గణేశ్ నిమజ్జన వేడుకల్లో పలు ఆసక్తికర దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. తాజాగా గోల్నాకలో ఓ భారీ గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం కోసం పడుకోబెట్టి తరలించిన ఘటన అందరి దృష్టిని ఆకర్షించింది. నిమజ్జన శోభాయాత్రలో భాగంగా కనిపించిన ఈ దృశ్యం స్థానికులను విస్మయానికి గురిచేసింది. గోల్నాకలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం అత్యంత ఎత్తుగా ఉండటంతో, శోభాయాత్ర సాగే మార్గంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు అడ్డంకిగా మారాయి. విగ్రహాన్ని నిటారుగా తీసుకెళితే విద్యుత్ వైర్లకు తగిలే ప్రమాదం ఉందని, తద్వారా విగ్రహానికి నష్టం వాటిల్లుతుందని నిర్వాహకులు భావించారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు నిర్వాహకులు ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. విగ్రహాన్ని వాహనంపై జాగ్రత్తగా పడుకోబెట్టి, ఎటువంటి అవాంతరాలు లేకుండా ముందుకు సాగారు. మార్గమధ్యంలో ఉన్న అడ్డంకుల దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇలా చేయాల్సి వచ్చిందని వారు వివరించారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## 100 శాతం సర్వే పూర్తి అయ్యేలా చూడాలి

ఒంటిమిట్ట సింధూరదర్శిని: ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి,లెప్రసి,ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న లెప్రసి సర్వే గురించి డాక్టర్ అరుణ జ్యోతి గారిని అడిగి తెలుసుకొని, తగు సూచనలను చేసి 100 శాతం సర్వే పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు.ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్‌ను క్షయ వ్యాధిగ్రస్తులకు చేస్తున్న పరీక్షలు,రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.

# సినిమా న్యూస్



రణ్‌వీర్ సింగ్‌కి షాలిని చౌహాన్ బిగ్ షాట్ ఇచ్చింది. షాలిని చౌహాన్ ఒక అద్భుతమైన కొత్త ఫోటోను షేర్ చేసిన తర్వాత అందరి దృష్టిని ఆకర్షించింది.

## ‘జైలర్ 2’ .. వెయ్యికోట్ల మాట!

**600 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టిన ‘జైలర్’**

**సీక్వెల్ గా రూపొందుతున్న ‘జైలర్ 2’**

**దసరాకి బరిలోకి దిగుతున్న సినిమా**

**వెయ్యికోట్లకి పైగా రాబట్టడం ఖాయమంటున్న ఫ్యాన్స్**

రజనీకాంత్ కి ఉన్న క్రేజ్ గురించి .. ఆయన సినిమాలకి గల మార్కెట్ ను గురించిగాని ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఒకానొక సందర్భంలో సీనియర్ దర్శకులతో మాత్రమే సినిమాలు చేస్తూ వెళ్లిన రజనీకాంత్, ఆ తరువాత యువ దర్శకులతో సినిమాలు చేయడానికి ఉత్సాహాన్ని చూపుతూ వెళ్లారు. అందుకు నిదర్శనంగా తెరపైకి వచ్చిన సినిమాలే ‘కబాలి’ .. ‘కాలా’ .. ‘జైలర్’. అప్పటివరకూ తెరపై కనిపిస్తూ వచ్చిన రజనీని లుక్ పరంగా కొత్తగా ఆవిష్కరించిన సినిమాలు ఇవి.

రజనీకాంత్ కెరియర్ లో సూపర్ హిట్లు .. బ్లాక్ బస్టర్ సినిమాలు చాలా ఉండొచ్చు. అయితే ఆ జాబితాలో ప్రత్యేకంగా కనిపించే సినిమాగా ‘జైలర్’ ను గురించి చెప్పుకోవచ్చు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. చాలా వేగంగా ఈ మార్కును అందుకున్న సినిమాగా ఇది నిలిచిపోయింది. రజనీ ఛరిష్మా ఎంతమాత్రం తగ్గలేదని నిరూపించిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ రెడీ అవుతోంది. దసరా కానుకగా అక్టోబర్ 15వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేయనున్నారు.

300 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మితమవుతున్న ఈ సినిమా, వెయ్యికోట్లకి పైగా వసూళ్లను రాబట్టడం ఖాయమనే మాట చాలా బలంగా వినిపిస్తోంది. మిథున్ చక్రవర్తి .. ఎస్ జె సూర్య .. విద్యాబాలన్ .. రమ్యకృష్ణ వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలకమైన పాత్రలలో కనిపించనున్నారు. అనిరుధ్ నేపథ్య సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకువెళుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దసరాకి ఈ సినిమా ఏ రేంజ్ లో సందడి చేస్తుందనేది చూడాలి మరి.



## అడవిలోని అద్భుతాన్ని వెదుకుతూ వెళ్లిన ‘ఫొటోగ్రాఫర్’ .. ఓటీటీలో!



తమిళంలో రూపొందిన ఫాంటసీ టచ్ తో కూడిన ఒక మిస్టరీ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీకి వచ్చేసింది. ఆ సినిమా పేరే ‘ఫొటోగ్రాఫర్’. ఆగస్టు 7వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 25వ తేదీ నుంచి ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. దర్శకుడిగా .. హీరోగా అష్రఫ్ అలీ చేసిన సినిమా ఇది. ఈ సినిమాకి కథను అందించింది కూడా ఆయనే. అలాంటి ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వారు దక్కించుకున్నారు.

తమిళంతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లో ఈ సినిమాను అందుబాటులోకి తెచ్చారు. ఇది ఒక ఫొటోగ్రాఫర్ చుట్టూ తిరిగే కథ. ‘వీరా’ ఒక ఫొటోగ్రాఫర్ .. తన టాలెంట్ పై తనకి విపరీతమైన నమ్మకం ఉంటుంది. కానీ సరైన గుర్తింపు లభించకపోవడం అతనిని నిరాశపరుస్తూ ఉంటుంది. ఏదైనా ఒక అద్భుతం చేయాలనే పట్టుదలతో అతను ఉంటాడు. అడవిలోని ఒక సీక్రెట్ ప్లేస్ లో ప్రకృతి సహజంగా జరిగే ఒక అద్భుతాన్ని గురించిన విషయం అప్పుడే అతనికి గుర్తొస్తుంది. దానిని తన కెమెరాలో బంధిస్తే తన కోరిక నెరవేరుతుందని భావిస్తాడు. ఆ వెంటనే అడవికి బయలుదేరుతాడు.

వీరా అడవిలోకి ప్రవేశించినప్పుడు చాలా సరదాగా .. ఆహ్లాదంగా అనిపిస్తుంది. ఆ తరువాత అతను డీప్ ఫారెస్టులోకి వెళుతున్న కొద్దీ వాతావరణం మారిపోతూ ఉంటుంది. తనని ఏవో అదృశ్య శక్తులు అనుసరిస్తున్నట్టు .. తనకి తెలియకుండానే తాను ప్రమాదంలోకి వెళుతున్నట్టుగా అనిపిస్తుంది. అది నిజమేననే విషయంలో స్పష్టత రావడానికి అతనికి ఎక్కువ సమయం పట్టదు. అప్పుడు అతను ఏం చేస్తాడు? అక్కడి నుంచి ఎలా బయటపడతాడు? అసలు అక్కడ ఏం జరుగుతోంది? అనేది కథ.

## ఈ జోడీకున్న క్రేజ్ వసూళ్లు కురిపించడం ఖాయమేనేమో!

కొంతమంది హీరోలకి ఒక అరుదైన అవకాశం లభిస్తూ ఉంటుంది. వాళ్లు సాధించిన హిట్ ఒకటి, ఆ తరువాత వచ్చిన వరుస ఫ్లాపులపై విరుగుడుగా పనిచేస్తూ ఉంటుంది. భారీ పరాజయాలు కూడా వాళ్ల కెరియర్ పై అంతగా ప్రభావం చూపించవు. ఆడియన్స్ వాటిని గురించి పెద్దగా పట్టించుకోరు .. మాట్లాడుకోరు. అలాంటి ఒక అరుదైన ఇమేజ్ ను సొంతం చేసుకున్న హీరోగా విజయ్ దేవరకొండ కనిపిస్తాడు. ఎప్పటికప్పుడు ఆయన నుంచి వచ్చిన ఫ్లాపులను పక్కనపెట్టి, కొత్త ప్రాజెక్టులను ఆదరించడానికి ఆడియన్స్ సిద్ధమైపోతూ ఉంటారు.






అలా ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రావడానికి ‘రణబాలి’ రెడీ అవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను, దసరా కానుకగా అక్టోబర్ 16వ తేదీన విడుదల చేయనున్నారు. భారీ బడ్జెట్ తో మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించిన సినిమా ఇది. 18వ శతాబ్దం నేపథ్యంలో నడిచే ఈ సినిమాలో, విజయ్ దేవరకొండ సరసన రష్మిక సందడి చేయనుంది. గతంలో ‘గీతగోవిందం’ .. ‘డియర్ కామ్రేడ్’ సినిమాలతో అలరించిన ఈ జంటకి ఇది మూడో సినిమా కావడం విశేషం.

18వ శతాబ్దం కాలం నాటి కథా నేపథ్యం .. అందుకు తగిన గెటప్పులతో విజయ్ దేవరకొండ – రష్మిక కనిపించనుండటం .. పెళ్లి తరువాత ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా ఇదే కావడం ఈ సినిమా ప్రత్యేకతలుగా కనిపిస్తున్నాయి. ఇక ఇంతవరకూ లవ్ .. రొమాన్స్ .. యాక్షన్ సినిమాలను చేస్తూ వచ్చిన విజయ్ దేవరకొండ, తొలిసారిగా చారిత్రక నేపథ్యం కలిగిన కథను ఎంచుకోవడం మరో విశేషంగా కనిపిస్తోంది. విజయ్ దేవరకొండ – రష్మిక కాంబినేషన్ ను తెరపై చూడాలని ముచ్చటపడుతున్న ఆడియన్స్, ఈ సినిమాకి ఏ స్థాయిలో పట్టం కడతారనేది చూడాలి.

## సీక్వెల్ బకెట్ పెరిగిపోతోంది.. ఎప్పటికి వస్తాయో?

జక్కన్న పుణ్యమా అని తెలుగు సినిమాలో సీక్వెల్ సీజన్ మొదలైంది. బాహుబలితో మొదలైన సీక్వెల్ సీజన్.. తెలుగులో అనుకున్నంత సక్సెస్ కాకపోవటం కనిపిస్తుంది. కొన్ని ప్రాజెక్టులు మినహాయిస్తే.. మిగిలిన వాటిపై బజ్ కూడా పెద్దగా లేని పరిస్థితి. ఒక సినిమాతో రెండు కలెక్షన్లు కొల్లగొట్టేయొచ్చన్న ఆలోచన బాగానే ఉన్నా.. ప్రేక్షకుడ్ని థ్రిల్ కు గురి చేయకపోతే.. మొదటి సినిమాలోనే చతికిలపడాల్సిన పరిస్థితి. ఈ రిస్క్ ను టాలీవుడ్ దర్శక నిర్మాతలకు అర్థమవుతోంది. అయితే.. ఒక్కసారి ఫ్రాంచైజ్ సెట్ అయితే.. కాసుల వర్షమే అన్న ఆశ వారి చేత సీక్వెల్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టేలా చేస్తోంది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుగా.. సీక్వెల్ తో భారీగా సొమ్ములు చేసుకోవచ్చన్న ఆలోచన బాగానే ఉన్నా.. చివరకు ఆ ప్రభావం పడుతోంది ప్రేక్షకుడి మీదనే. మొదటి భాగం పూర్తై.. రెండో భాగం కోసం ఏళ్లకు ఏళ్లు వెయిట్ చేయాల్సిన పరిస్థితి. ఇందుకు రాజమౌళి మినహాయింపుగా చెప్పాలి. బాహుబలి సీక్వెల్ విషయంపై ఆయన ఎప్పటికప్పుడు అప్డేట్ ఇచ్చేవారు. సీక్వెల్ మీద ఉన్న ఆసక్తిని అంతకంతకూ పెంచేలా ఆయన ప్లానింగ్ ఉండేది. ఆయన్ను అనుకరిస్తూ సీక్వెల్ తీసేందుకు సిద్ధమైనోళ్లు.. జక్కన్న మాదిరి ప్లానింగ్ విషయంలో మాత్రం ఫెయిల్ అవుతున్నారని చెప్పాలి. సీక్వెల్ ఉంటుందని ప్రకటించి.. ఆ చిత్రానికి సంబంధించిన అప్డేట్ ను ఆర్నెల్లకు ఒకసారి కూడా ఇవ్వని పరిస్థితి. సీక్వెల్ కోసం ఎదురుచూసే ప్రేక్షకులు విసుగెత్తిపోయేలా పరిస్థితి మారింది. కల్కి 2898ఏడీ సినిమానే తీసుకుందాం. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందన్న విషయాన్ని యూనిట్ అస్సలు చెప్పలేదు. ఆ మాటకు వస్తే.. ఆ సినిమా క్లైమాక్స్ సంగతి తర్వాత.. కథ మధ్యలో ఆగిపోతుంది. 2024లో విడుదలైన ఈ సినిమాకు సంబంధించిన పార్ట్ 2 షూటింగ్ ఈ ఏడాది అక్టోబరులో షురు అవుతుందని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది విడుదల అవుతుందని చెబుతున్నా.. అదంతా జరిగే పనేనా? అన్నది ప్రశ్న. సలార్ 2 విషయానికి వసతే.. ఈ సినిమా 2023 సెప్టెంబరులో విడుదలైంది. దీని సీక్వెల్ కు సంబంధించిన విషయానికి వస్తే.. పార్ట్ 2 శౌర్యాంగ పర్వం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ లో ఉంది. ఈ సినిమాకు సంబంధించి దాదాపు 20 శాతం షూటింగ్ ఇప్పటికే పూర్తైనట్లు చెబుతున్నారు. ఈ చిత్ర దర్శకుడు ప్రశాంత నీల్ ఎన్టీఆర్ తో తీస్తున్న డ్రాగన్ ప్రాజెక్టు అనూహ్య పరిస్థితుల్లో ఆగటం తెలిసిందే. ఎన్టీఆర్ భుజానికి గాయం కావటంతో ఈ చిత్రం ఆలస్యమవుతున్న వేళ.. నీల్ ఇప్పుడు తన ఫోకస్ ను సలార్ 2 మీద పెట్టినట్లుగా చెబుతున్నారు. ఈ చిత్ర షూటింగ్ మొత్తాన్ని 2027 నాటికి పూర్తి చేయాలన్న ప్లాన్ తో ఉన్నట్లు చెబుతున్నారు. . ఓదెలపై వేణుస్వామి కామెంట్స్ ఆసక్తికరమైన అంశం ఏమంటే.. తెలుగు హీరోల్లో సీక్వెల్ సినిమాలు బాకీ ఉన్న కథానాయకుడిగా డార్లింగ్ ప్రభాస్ నిలుస్తారు. కల్కి.. సలార్ రెండు సినిమాలే కాదు.. డిజాస్టర్ రాధేశ్యామ్ కు సీక్వెల్ ఉంటుందని చెప్పినా.. ఆ సినిమా తుది ఫలితం నేపథ్యంలో సీక్వెల్ అటకెక్కినట్లే. ఎన్టీఆర్ నటించిన దేవర మూవీ సీక్వెల్ అప్డేట్ కోసం చాలా కాలమే ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ మధ్యనే ఈ సినిమా సీక్వెల్ కు సంబంధించిన వివరాల్ని చిత్ర నిర్మాత వెల్లడించటం తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు నడుస్తున్నట్లు చెబుతున్నారు.

త్వరలోనే దీని రెగ్యులర్ షూట్ మొదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం భుజం గాయంతో ఇబ్బంది పడుతున్న తారక్.. దాని నుంచి కోలుకోవటం.. అనంతరం ఆయన ఇప్పటికే కమిట్మెంట్ ఇచ్చిన సినిమాలు పూర్తి చేసిన తర్వాతే దేవర 2 మీద ఫోకస్ చేస్తారని చెప్పొచ్చు. పాన్ ఇండియా స్థాయిలో విపరీతమైన బజ్ వచ్చి.. సీక్వెల్ కోసం ఎదురుచూస్తున్న మూవీల్లో యానిమల్ పార్క్ నిలుస్తుంది. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రణ్ బీర్ కపూర్ కథానాయకుడిగా నటించటం.. ఈ సినిమా బాక్సాఫీస్ ను ఎంతలా షేక్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమా మొత్తం మూడు భాగాల్లో ఉండేలా దర్శకుడి ఆలోచనలు ఉన్నట్లుగా రణ్ బీర్ కపూర్ ఒక ఇంటర్వ్యూలో చెప్పటం తెలిసిందే.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662